కండ్లకోయ గేట్ వే ఐటీ పార్కును పూర్తి చేయాలి



టీఎస్ఐఐసీ ఎండీ, వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని కలిసిన ఓరుగంటి వెంకటేశ్వర్లు

మేడ్చల్, జనవరి 27: మేడ్చల్ జిల్లా కండ్లకోయ గేట్ వే ఐటీ పార్కును పూర్తిచేయాలని టీఎస్ ఐఐసీ ఎండీ, వైస్ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిని కొంపల్లి ఐటీ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఓరుగంటి వెంకటేశ్వర్లు కోరారు. ఆయన ఎండీతో సమావేశమై ఐటీ పార్క్ ఏర్పాటు, మేడ్చల్ వరకు మెట్రోరైల్ విస్తరణపై శనివారం చర్చించారు. ఆయన మాట్లాడుతూ.. ఐటీ పార్కును అభివృద్ధి చేస్తే నగరం ఉత్తరాన అభివృద్ధి చెందుతుందన్నారు. 200 చిన్న మధ్యతరహా ఐటీ కంపెనీలు, యువ పారిశ్రామిక వేత్తలు ఐటీ పార్కులో కార్యకలాపాలను ప్రారంభించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని ఎండీ దృష్టికి తీసుకువచ్చారు. పెరుగుతున్న రద్దీని తగ్గించడానికి మేడ్చల్ వరకు మెట్రో రైల్‌ను విస్తరించాలన్నారు. ఇందుకు టీఎస్ఐఐసీ ఎండీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఐటీ పార్క్ అభివృద్ధిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించి, మేట్రో రైల్ పొడగింపు ప్రతిపాదనను మెట్రో రైల్ కార్పొరేషన్‌కు పరిశీలన కోసం పంపారని చెప్పారు.

ఎమ్మెస్సీ పరీక్షా తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 27: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎమ్మెస్సీ (మాలిక్యులర్ హ్యూమన్ జెనిటిక్స్) పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొ. రాములు తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 30వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ప్రజా సంక్షేమానికి యాగాలు.. అభినందనీయం

- గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్
- ఎన్టీఆర్ స్టేడియంలో వైభవంగా శ్రీకాళీ కాళ భైరవ కల్యాణం
- హాజరైన డిప్యూటీ సీఎం భట్టి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ఎండు మిర్చీలు వేసి యాగం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్

కవాడిగూడ, జనవరి 27: ప్రజల సంక్షేమానికి యాగాలు జరిపించడం అభినందనీయమని గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కోటి ప్రత్యంగిరా యాగం వల్ల లోక కల్యాణం జరుగుతుందని వారు పేర్కొన్నారు. సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణోత్సవం సందర్భంగా కుర్తాళం సిద్ధేశ్వరానంద పీఠం ఆధ్వర్యంలో నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం జరుగుతున్న కోటి ప్రత్యాంగిరా మహా యాగంలో భాగంగా సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి నేతృత్వంలో శ్రీకాళీ కాళ భైరవ కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏడు రోజుల పాటు హోమ యాగాలు, పూజలు వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథులుగా హాజరై యాగంలో పాల్గొన్నారు. శ్రీ కాశీ క్షేత్రంలో భైరవుని పూజించిన రుద్రాక్ష కార్యక్రమాన్ని నిర్వంహించారు. అనంతరం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అనంతరం, సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి పాల్గొని భక్తులకు అనుగ్రహం చేశారు. కార్యక్రమంలో రమ్యానంద భారతి స్వామిని, పీఠం కో-ఆర్డినేటర్ మునిపల్లె శ్రీనివాస్, చీఫ్ అపరేటింగ్ ఆఫీసర్ మోచర్ల శశిభూషణ్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం, తీర్థప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి

అధికారులను కోరిన కేంద్ర మంత్రి

సిటీబ్యూరో, జనవరి 27(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అధికారులను కోరారు. హరిత ప్లాజా హోటల్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సమితి (దిశా) సమావేశంలో కేంద్ర మంత్రి శనివారం పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాయంతో అమలవుతున్న అభివృద్ధి పనులపై మంత్రి సమీక్షించారు. బ్యాంకు, విద్యా, ఆరోగ్య, రైల్వే, వాటర్ వర్క్స్, సివిల్ సప్లై, నేషనల్ హైవే, మహిళా శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ, ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ, పవర్ సప్లయ్, వివిధ విభాగాలపై సమీక్షించారు. బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎంత మేరకు రుణాలు మంజూరు చేశారో ఆరా తీశారు. జీహెచ్ఎంసీ అధికారులను ముద్ర, స్వానిధి, శిశు, కిషోర్, తరుణ్ గురించి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కేంద్ర పథకాలు సమన్వయం చేసుకుంటూ పనులు వేగవంతం చేయాల్సి ఉందని

సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు కే కేశవరావు, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, జిల్లా ప్రణాళిక అధికారి సురేందర్, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి. ప్రియదర్శిని

రవీంద్రభారతి, జనవరి 27: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి. ప్రియదర్శిని అన్నారు. హెరిటేజ్ ఫెస్ట్ - హరేకృష్ణ మూవ్‌మెంట్ వార్షిక సాంస్కృతిక కార్యక్రమాలు రవీంద్రభారతిలో శనివారం నిర్వహించబడ్డాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని, అక్షయ పాత్ర ఫౌండేషన్ ప్రాంతీయ (తెలంగాణ, ఏపీ) అధ్యక్షుడు సత్యగౌర చంద్ర దాస ప్రభూజీ విచ్చేశారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు బహుమతులు, ట్రోఫీలు, షీల్డ్‌లను బహూకరించారు. ప్రియదర్శిని మాట్లాడుతూ చిన్ననాటి నుంచి చదువుతో పాటు సంగీతం, సాహిత్యం, క్రీడా పోటీలు, నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలన్నారు. నేటి తరం యువతరానికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలు, అభ్యాసాలను పెంపొందించడానికి హరేకృష్ణ మూవ్‌మెంట్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సభకు ముందు పలు పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి వీక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కార్యక్రమంలో సత్యగౌర చంద్ర దాసు ప్రభూజీ పాల్గొన్నారు.

విజయోత్సవాలను విజయంతంగా నిర్వహించుకుందాం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్ నియోజకవర్గం ముఖ్య నాయకులతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్, జనవరి 27(నమస్తే తెలంగాణ): ఇటివల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గం నుంచి నన్ను గెలిపించినందున విజయోత్సవ సమావేశాలు విజయవంతంగా నిర్వహించుకుందామని మాజీ మంత్రి మల్లారెడ్డి అన్నారు. బోయిన్‌పల్లిని క్యాంపు కార్యాలయంలో మేడ్చల్ నియోజకవర్గం ముఖ్య నాయకులతో శనివారం మాజీ మంత్రి మల్లారెడ్డి విజయోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. విజయోత్సవ సభలు శామీర్‌పేట్ మండలం అలియాబాద్ చౌరస్తా సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 29న గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ, మేడ్చల్ మండలం, 30న తూకుంట మున్సిపాలిటీ, మూడు చింతలపల్లి, 31న దమ్మాయిగూడ మున్సిపాలిటీ, నాగారం మున్సిపాలిటీ, కీసర మండలం నాయకులు, కార్యకర్తలతో సమావేశాలను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

ప్రపంచ జ్ఞానాన్ని ఒడిసి పట్టిన చిత్రకారుడు కొండపల్లి

శేషగిరిరావు జీవితం, చిత్రకళా రంగం ఆధారంగా రచించిన యాన్ ఒడిస్సీ ఆఫ్ లైఫ్ అండ్ ఆర్ట్ గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, బీవీ పాపారావు, ఏలె లక్ష్మణ్ తదితరులు

ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

తెలుగు యూనివర్సిటీ, జనవరి 27: ప్రపంచ జ్ఞానాన్ని సముపార్జించిన గొప్ప చిత్రకారుడు కొండపల్లి శేషగిరిరావు అని శాసన మండలి సభ్యురాలు సురభి వాణీదేవి అన్నారు. ప్రఖ్యాత చిత్రకారుడు డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు శత జయంతి వేడుకలు మాసబ్‌ట్యాంకులోని జేఎన్ఏఎఫ్ఏయూ ఆడిటోరియంలో కుటుంబ సభ్యులు, ఆత్మీయుల మధ్య శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత ఆనంద్ గడప, ప్రొఫెసర్ నిర్మలా బిలుకా ఇరువురు శేషగిరిరావు జీవితం, చిత్రకళా రంగం ఆధారంగా రచించిన 'యాన్ ఒడిస్సీ ఆఫ్ లైఫ్ అండ్ ఆర్ట్' గ్రంథాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ఆవిష్కరించారు. శేషగిరిరావు చిత్రకళలను సమగ్రంగా సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నేటి తరానికి తెలియజేయాలనే సంకల్పంతో ఆయన మునిమనవడు అర్జున్ కనపర్తి రూపొందించిన వెబ్‌సైట్‌ను వాణీదేవి ప్రారంభించారు. అనంతరం శేషగిరిరావు ఎక్స్‌లెన్సీ అవార్డును 2024కుగాను జేఎన్ఏఎఫ్ విద్యార్థి కైలాశ్ దొరకు రూ.10 వేల నగదుతో అందించి సత్కరించారు. రంగోలి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా సురభి వాణీదేవి మాట్లాడుతూ తెలంగాణలో గొప్ప గొప్ప కళాకారులకు కొదవలేదన్నారు. గొప్ప పరిశోధకులు శేషగిరిరావు జీవితంపై మరిన్ని పరిశోధనలు జరగాలని సురభి వాణీదేవి ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ కవితా దర్యాణిరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి బీవీ పాపారావు, ప్రముఖ చిత్రకారులు డాక్టర్ ఏలె లక్ష్మణ్, రమణ, వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కొడాలి సుందర్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ విష్ణువర్ధన్, సీఎఫ్ఏ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గంగాధర్, ఆనంద్, జె.వెంకటేశ్వర్లు, కాంతరెడ్డి, శేషగిరిరావు కుటుంబ సభ్యులు కె.వేణుగోపాలరావు, ప్రొఫెసర్ కొండపల్లి నిహారిణి పాల్గొన్నారు.

న్యాయ అధ్యయనాల చైర్ ప్రొఫెసర్‌గా రవీంద్ర భట్

శామీర్‌పేట, జనవరి 27: నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయంలోని ఎమ్‌కే నంబియార్ సార్క్ లా సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ లీగల్‌కు రాజ్యాంగ న్యాయ అధ్యయనాల చైర్ ప్రొఫెసర్‌గా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.రవీంద్ర భట్‌ను నియమిస్తున్నట్లు వీసీ ప్రొఫెసర్ కృష్ణదేవరావు ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జస్టిస్ రవీంద్ర భట్ అధ్యయన కేంద్రానికి మార్గ నిర్దేశం చేస్తారని, దానితో పాటు కేంద్రం పరిశోధన కార్యకలాపాలకు తగిన క్రియాత్మక సలహాలు సూచిస్తారని పేర్కొన్నారు. ఎమ్‌కే నంబియార్ సార్క్ లా సెంటర్‌గా పేరొందిన సుప్రీం కోర్టు న్యాయవాది వేణుగోపాల్ ఇచ్చిన నిధి ద్వారా 2003లో ఈ కేంద్రం ప్రారంభమైందన్నారు. ఈ కేంద్రానికి ప్రొ.నిముషకవి వాసంతిని డైరెక్టర్‌గా పూర్వ విద్యార్థులు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా సుహాసిని సేన్, రీసెర్చ్ కో ఆర్డినేటర్‌గా మాళవిక ప్రసాద్, రీసెర్చ్ ఫెలో రాజీ గురురాజ్‌లను నియమించారు.

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం

జూబ్లీహిల్స్, జనవరి 27: హైటెక్ సిటీలోని శిల్పారామంలో శనివారం త్యాగరాజ ఆరాధన ఉత్సవం-2024లో భాగంగా శివాని సరస్వతుల గాత్ర కచేరి అందించి శ్రోతలకు వీణుల విందైన సంగీతాన్ని అందించారు. మధురమైన కీర్తనలతో మృదువైన రాగాలాపనతో కచేరి ఉల్లాసభరితంగా సాగింది. కచేరి అనంతరం, హోప్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కె.సునీత, కె.ఎస్.రావు శివానిని ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు అవార్డులు అందజేసి ప్రసంగిస్తున్న సజ్జనార్

మాతృభాషను పరిరక్షించుకుంటూనే ప్రావీణ్యం సంపాదించాలి

ఆర్టీసీ ఎండీ సజ్జనార్

తెలుగు యూనివర్సిటీ, జనవరి 27: మాతృభాషలను పరిరక్షించుకుంటూనే బహుభాషలలో ప్రావీణ్యం సంపాదించుకోవాలని టీఎస్ ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్ విద్యార్థులకు సూచించారు. కన్నడ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో తెలంగాణ, గోవా రాష్ట్రాలలో కన్నడ మీడియం చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాయలం ప్రాంగణంలో గల ఆడిటోరియంలో శనివారం అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన సజ్జనార్ ప్రసంగిస్తూ ఆంగ్ల భాష ప్రభావం నేటి సమాజంలో ఎక్కువగా ఉన్నప్పటికీ కన్నడ మీడియంలో విద్యనభ్యసించి అత్యుత్తమ ఫలితాలను సాధించడం అభినందనీయమన్నారు. మాతృభాషలో పట్టు సాధిస్తూనే ఇతర భాషలను నేర్చుకుని పోటీ ప్రపంచంలో రాణించి ఉపాధి అవకాశాలను పొందాలని అన్నారు. కన్నడ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీ సంతోష్ హంగల్, బెంగళూరుకు చెందిన ప్రొఫెసర్ సి.నంజున్‌దయ్య, కన్నడిగాస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు ధర్మేంద్ర పుజారి, కర్ణాటక శిక్షణ సమితి కార్యదర్శి ముకుంద్ కులకర్ణి, మరఠ్వాడ-కన్నడ సంఘ్ జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ తెలంగ్ పాల్గొన్నారు.

ముగిసిన నేచర్ క్యాంపు

షాబాద్, జనవరి 27: తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎకో టూరిజం కార్యక్రమాలలో భాగంగా చిల్కూరు ఫారెస్ట్ ట్రెక్ పార్క్ నందు నూతనంగా నేచర్ క్యాంపు నిర్వహించారు. ఈ నేచర్ క్యాంపులో హైదరాబాద్ నలుమూలల నుంచి 20 మంది పాల్గొన్నారు. ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమైన ఈ నేచర్ క్యాంపు 27వ తేదీన శనివారం ఉదయం 11:30 గంటలకు ముగిసింది. ఈ క్యాంపుని బుకింగ్ చేసుకున్న వారంతా రెయిన్ ట్రీ రచ్చబండ దగ్గర హాజరు కాగా, వారికి ఎకో టూరిజం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎకో టూరిజం ప్రాజెక్ట్ మేనేజర్ కళ్యాణపు సుమన్ నేచర్ క్యాంపు గురించి, జరగబోయే కార్యక్రమాల

నేచర్ క్యాంపులో పాల్గొన్న ప్రజలు

గురించి వివరించారు. నేచర్ క్యాంపు ముగింపు కార్యక్రమానికి టీఎస్ఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్ నాయక్ పాల్గొని క్యాంపు నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, నేచురలిస్ట్‌లు శ్రీకాంత్, భాస్కర్, టీఎస్ఎఫ్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధనా సిబ్బందికి నిరంతరం శిక్షణ

జేఎన్టీయూలో 29 నుంచి ప్రారంభం కానున్న రెండు వారాల ఎఫ్‌డీపీ

సిటీబ్యూరో, జనవరి 27(నమస్తే తెలంగాణ)/కేపీహెచ్‌బీ కాలనీ: అధ్యాపకులకు నిరంతరాయంగా టీచింగ్ మెళకువలు, నూతన సిలబస్ వంటి ఆధునిక బోధనా పద్ధతులపై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఉండే కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఈసీఈ, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్‌తో పాటు ఇంగ్లిష్ లాంగ్వేజ్ వంటి డిపార్టుమెంట్ల వారీగా అధ్యాపకులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషనర్ (యూజీసీ) మార్గదర్శకాలు ప్రకారం రాష్ట్రంలో కేవలం జేఎన్టీయూ మాత్రమే కాకుండా, ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ వంటి సంప్రదాయ యూనివర్సిటీలతో పాటు ఇతర స్పెషలైజ్డ్ యూనివర్సిటీలకు చెందిన పలు విభాగ అధ్యాపకులకు కూడా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యూనివర్సిటీలలో యూజీసీ-ఎఫ్‌డీపీ (ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అందుకు ఒక ప్రొఫెసర్ స్థాయి వ్యక్తిని డైరెక్టర్‌గా నియమిస్తున్నారు. కేవలం యూనివర్సిటీ కాలేజీలలో ఉన్న ఫ్యాకల్టీకీ మాత్రమే కాకుండా యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న అఫిలియేషన్ కాలేజీలు, అటానమస్ కాలేజీలలో పని చేస్తున్న అధ్యాపకులకు కూడా రెండు నుంచి మూడు వారాల పాటు ఎఫ్‌డీపీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొనసాగింపుగా.. జేఎన్టీయూ బయో టెక్నాలజీ విభాగంలో రెండు వారాల పాటు అంటే ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రామ్ (ఎఫ్‌డీపీ)ని నిర్వహించనున్నారు.

ఎంపికైన టీఎల్ఎంతో కవిత

దక్షిణ భారత విజ్ఞాన మేళాకు జడ్పీహెచ్ఎస్ టీచర్ టీఎల్ఎం ఎంపిక

మేడ్చల్, జనవరి 27: మేడ్చల్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఉపాధ్యాయురాలు రూపొందించిన టీఎల్ఎం (బోధనా సామగ్రి) దక్షిణ భారత దేశ స్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికైంది. అభ్యాసం సులభతరం చేయడంలో భాగంగా పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు ముప్పాళ్ల కవిత పలు టీఎల్ఎంలను రూపొందించారు. ఆమె రూపొందించిన ఒక టీఎల్ఎం దక్షిణ భారత దేశ స్థాయి విజ్ఞాన మేళాకు ఎంపికైంది. రాష్ట్రం నుంచి ఈ మేళాకు 10 ప్రాజెక్టులు ఎంపిక కాగా, జిల్లా నుంచి ఒక్క కవిత టీఎల్ఎం మాత్రమే ఎంపికైంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజుల, సహచర ఉపాధ్యాయులు కవితను ప్రత్యేకంగా అభినందించారు.

నగరంలో మరో రిహాబిలిటేషన్ సెంటర్

బేగంపేట్ జనవరి 27: హైదరాబాద్ మహా నగరంలో ఉన్న 1.31 కోట్ల మంది జనాభాలో 28 లక్షల మందికి, అంటే దాదాపు ప్రతి ముగ్గురిలో ఒక్కరికి వారి జీవితంలో ఏదో ఒక సమయంలో రీహాబిలిటేషన్ సేవలు అవసరం పడుతున్నాయి. కానీ, ప్రస్తుతం నగరంలో 5,820 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, వీటి కొరతను కొంతవరకైనా తీర్చేందుకు అనంత రీహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్టు పెయిన్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రాన్సిషపల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు సంస్థ సీఈవో, తెలంగాణ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ మాజీ సీఈవో డాక్టర్ ఎం.చంద్రశేఖర్ తెలిపారు. ఈ కేంద్రాన్ని ఈ నెల 29న బేగంపేట్‌లో త్రిదండి చిన జీయర్ స్వామీజీ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు వారు వెల్లడించారు. బేగంపేట్‌లోని సెంటర్ కార్యాలయ సమావేశంలో బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

అట్టహాసంగా కామిక్ కాన్

యువత, చిన్నారులను అలరిస్తున్న కామిక్ గేమింగ్స్

మాదాపూర్, జనవరి 27: హైదరాబాద్ మహా నగర వేదికపై కామిక్ కాన్ అట్టహాసంగా ప్రారంభమై, చిన్నా, యువతరాన్ని అలరిస్తున్నది. స్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్, సూపర్ మ్యాన్, ఐరన్ మ్యాన్ వంటి క్యారెక్టర్స్ ఒకేసారి చిన్నారుల కండ్ల ముందు ప్రత్యక్షమైతే వారి ఆనందానికి అవధులే ఉండవు. ఓ వైపు యువత, మరో వైపు చిన్నారులను అలరించేందుకు పలు రకాల గేమింగ్స్, కార్టూన్స్, చిత్ర కథలతో కామిక్ కాన్ శనివారం హైటెక్స్ వేదికగా కొలువుదీరింది. ఇందులో గేమింగ్, కామిక్స్, సూపర్ హీరోస్, మెర్చెండైజ్‌తో పాటు సృజనాత్మకత, కంటెంట్ రైటర్స్ ఉన్నారు. యువతను మైమరిపించే రీతిలో సినిమాటిక్ క్యారెక్టర్స్ దర్శనమివ్వగా, పిల్లలను అలరించే గేమింగ్స్, కథలు స్టాల్స్‌తో పాటు అమర్ చిత్ర కథలు దర్శనమిస్తున్నాయి. కామిక్స్, కథలతో పాటు జాతీయ, అంతర్జాతీయ క్రియేటర్స్ ఇందులో భాగస్వామ్యం వహించడం విశేషం. యానిమేషన్, కామిక్స్, గేమింగ్, పాప్ కల్చర్ వంటివి కార్యక్రమంలో ఏర్పాటు చేయడంతో కామిక్ కాన్ హైదరాబాద్ యువతను ఎంతగానో ఉర్రూతలూగించింది. ఎలియన్స్ వేశ ధారణతో డ్యాన్సులు చేస్తూ సందర్శకులను ఎంతగానో అలరించారు. ఇందులో బెస్ట్ ఇండియన్ కామిక్స్, కాస్ ప్లే, గేమింగ్, గీకీ, షాపింగ్ ముఖ్యమైనవని, మూడేళ్ళ తరువాత ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించడం సంతోషంగా ఉందని కామిక్ కాన్ ఇండియా ఫౌండర్ జతిన్ అన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో ఇండువెర్స్, యాలి డ్రీమ్స్, క్రియేషన్స్, సుఫి కామిక్స్, ప్రసాద్ బట్, రాజ్ కామిక్స్, లిలోరోష్, యాసిడ్ టోడ్, గార్బెజ్ బిన్, కార్పొరేట్ కామిక్స్, బుల్స్ ఐ

కామిక్ కాన్ షోలో పలు రకాల వేశధారణతో అలరించిన ప్రదర్శన

ప్రెస్, బాకర్మార్క్స్, ఆర్ట్ ఆఫ్ సావియా, ప్రముఖ పబ్లిషింగ్ హౌస్‌లకు చెందిన కామిక్స్‌లను ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా నటుడు తరుణ్ తేజ్ నటించిన ఆపరేషన్ వాలెంటైన్ మూవీ ప్రమోషన్‌ను సినిమా యూనిట్‌తో కలిసి చేశారు. అయితే, రాజేష్ నాగులకొండ హనుమాన్ కార్టూన్‌లతో రాసిన పుస్తకం అందరి మనసును హత్తుకునేలా ఉంది. ఈయన మూడేండ్లుగా 3 కామిక్ కాన్ అవార్డులను అందుకోవడం విశేషం.

ఫిబ్రవరి 11న అనురాగ్ వర్సిటీ సెట్

- మెరిట్ విద్యార్థులకే సీట్లు: సీఈవో నీలిమ
- అనురాగ్ వర్సిటీ-2024 సెట్ షెడ్యూల్ విడుదల

సెట్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యూనివర్సిటీ సీఈఓ నీలిమ, చిత్రంలో తదితరులు

సిటీబ్యూరో, జనవరి 27(నమస్తే తెలంగాణ): అనురాగ్ యూనివర్సిటీలో 2024-2025 విద్యా సంవత్సరం అడ్మిషన్ల కోసం వచ్చే నెల ఫిబ్రవరి 11 నుంచి నిర్వహించే అనురాగ్ సెట్-2024 ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన వారికే తమ యూనివర్సిటీలో సీట్లు తప్పకుండా వస్తాయని ఆ యూనివర్సిటీ సీఈవో నీలిమా తెలిపారు. ఈ మేరకు అనురాగ్ వర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అనురాగ్ సెట్-2024 ప్రవేశ పరీక్ష షెడ్యూల్‌కు సంబంధించిన బ్రోచర్‌ను విడుదల చేశారు. సీఈవో నీలిమా మాట్లాడుతూ, అనురాగ్ సెట్‌లో మొదటి 10 ర్యాంకులు సాధించిన వారికి వంద శాతం స్కాలర్‌షిప్‌లు పొందుతారని ప్రకటించారు. 11 నుంచి 25 ర్యాంకులోపు వారికి 50 శాతం, 26 నుంచి 100 లోపు ర్యాంకుల వారికి 25 శాతం ట్యూషన్ ఫీజులో మినహాయింపు ఇస్తామన్నారు. అలాగే ఎప్‌సెట్‌లో 1 నుంచి 10 వేల ర్యాంకర్లకు, జేఈఈలో 1 నుంచి 50 వేల లోపు ర్యాంకర్లకు 50 శాతం ట్యూషన్ ఫీజులో రాయితీ కల్పిస్తామన్నారు. అనురాగ్‌సెట్-2024 ప్రవేశ పరీక్షకు వచ్చే నెల 11న నిర్వహిస్తున్నామని, ఈ సెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల 10 వరకు గడువు విధించామన్నారు. అలాగే ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్లో కూడా నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు www.anurag.edu.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీ స్వార్థపరుల వల్లనే కుల గణన జాప్యం

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్, జనవరి 27: కులగణన ముందుకు సాగకపోవడాన